మన ప్రజా ప్రతినిధి
ప్రశ్నించడం కోసం...?
RNI NO. TELTEL/2023/90455
తెలుగు దినపత్రిక
ఎడిటర్: జి. శ్రీనివాస్ సంపటి : 3 సంచిక :264 ఆదివారం జూలై 19 2026, పేజీలు - 4 వేల : 2/-
epaper.manaprajaprathinidhi.com
PUBLISHED FROM: TELANGANA / ANDHRAPRADESH

# వాంగ్‌చుక్ దీక్షపై ఉత్కంఠ

- 21వ రోజుకు చేరిన నిరాహార దీక్ష
- ఆరోగ్యం క్షీణించడంతో ఆసుపత్రికి తరలింపు
- జూలై 20న పార్లమెంట్ మార్చ్‌కు పిలుపు



న్యూఢిల్లీ, జూలై 18 (మనప్రజాప్రతినిధి): ప్రవేశ పరీక్షల నిర్వహణలో జరిగిన అవకతవకలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష 21వ రోజుకు చేరింది. దీర్ఘకాలంగా ఆహారం తీసుకోకపోవడంతో ఆయన ఆరోగ్యం క్షీణించగా, ఢిల్లీ హైకోర్టు ఆదేశాలు, వైద్యుల సూచనల మేరకు శనివారం ఉదయం ఢిల్లీ పోలీసులు ఆయనను సఫ్దర్‌జంగ్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నప్పటికీ నిరంతర వైద్య పర్యవేక్షణ అవసరమని ఆసుపత్రి వైద్యులు తెలిపారు. నీట్‌తో పాటు ఇతర జాతీయ ప్రవేశ పరీక్షల్లో ప్రశ్నాపత్రాల లీకులు, పరీక్షల నిర్వహణలో జరిగిన లోపాలపై బాధ్యత వహించాలని వాంగ్‌చుక్

2

## యువతకు అండగా ఉంటా కేటీఆర్



- యువ సంగ్రామ సదస్సులో కేటీఆర్ విమర్శలు
- యూత్ డిక్లరేషన్ పేరుతో యువతను కాంగ్రెస్ మోసం చేసిందని ఆరోపణ
- తెలంగాణ పరిశ్రమల తరలింపుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై విమర్శలు
- యువతకు అండగా ఉంటానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ హామీ

2

## కల్తీలపై కఠిన చట్టం అమలు చేయండి సీఎం



- ఆహార, ఔషధ కల్తీల నిరోధానికి సమగ్ర చట్టం రూపొందించాలని సీఎం ఆదేశం
- విజిల్ బ్లోయర్ వ్యవస్థ, టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయాలని సూచన
- విదేశీ విధానాల అధ్యయనం చేసి బిల్లును సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశాలు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

2

## పెద్ద కలలు కనాలి...కష్టపడి చదవాలి



- తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను సందర్శించిన మంత్రి మహమ్మద్ అజారుద్దీన్
- విద్యార్థులతో కలిసి క్రికెట్ ఆడిన మాజీ భారత కెప్టెన్
- విలువలు, క్రమశిక్షణతోనే జీవితంలో విజయం సాధ్యమన్న మంత్రి

2

## పవన్‌ను పరామర్శించిన లోకేష్



- శస్త్రచికిత్స అనంతరం ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న మంత్రి
- కనకదుర్గమ్మ చిత్రపటం, ప్రసాదం అందజేసిన నారా లోకేష్
- త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన ఐటీ, విద్యాశాఖ మంత్రి

2

## 2027 నాటికి పోలవరం పూర్తి చేస్తాం

- వంద శాతం పనులు పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడి
- నదుల అనుసంధానంతో కరవు రహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యమని స్పష్టం
- 'తల్లికి వందనం' పథకం ఈ నెల నుంచే ప్రారంభమవుతుందని ప్రకటన




3

## మహిళపై దాడి.. వేగంగా చర్యలు

- టీడీపీ నాయకుడి సస్పెన్షన్.. అరెస్టు
- చట్టం ముందు అందరూ సమానమేనన్న చంద్రబాబు
- మహిళల భద్రతపై రాజీ లేదని ప్రభుత్వ స్పష్టీకరణ

అమరావతి, జూలై 18 (మనప్రజాప్రతినిధి): గుంటూరు నగరంలోని కృష్ణబాబు కాలనీలో ఓ మహిళపై జరిగిన దాడి ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం వేగంగా స్పందించింది. ఘటనలో ప్రమేయం ఉన్న వ్యక్తి అధికార తెలుగుదేశం పార్టీకి చెందిన నాయకుడిగా గుర్తించిన వెంటనే అతడిని పార్టీ నుంచి సస్పెండ్ చేయడంతో పాటు క్రిమినల్ కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ప్రభుత్వం వెల్లడించింది. మహిళల భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, చట్టం ముందు అందరూ సమానమేనని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్'లో స్పందించిన ఆయన, ఏ మహిళనైనా అవమానించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు. ఇలాంటి ఘటనలకు సమాజంలో తావు లేదని, వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. రాజకీయ పార్టీ పేరు చెప్పుకుని చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే వారికి ఎలాంటి రక్షణ ఉండదని తేల్చిచెప్పారు.రాష్ట్ర సమాచార సాంకేతిక, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ కూడా ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు నిందితుడిపై వెంటనే క్రిమినల్ కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు. పార్టీ పదవుల నుంచి కూడా అతడిని సస్పెండ్ చేసినట్లు

2

## విక్రమ్-1 విజయంపై మోదీ హర్షం

- స్కైరూట్ వ్యవస్థాపకులతో ఫోన్‌లో మాట్లాడిన ప్రధాని
- భారత్ స్వయం సమృద్ధికి నిదర్శనమని ప్రశంస
- ప్రైవేటు అంతరిక్ష రంగానికి కొత్త ఊపునిచ్చిన విజయం

శ్రీహరికోట, జూలై 18 (మనప్రజాప్రతినిధి): హైదరాబాద్‌కు చెందిన స్కైరూట్ ఏరోస్పేస్ సంస్థ అభివృద్ధి చేసిన విక్రమ్-1 ఆర్బిటల్ రాకెట్ విజయవంతమైన ప్రయోగంపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఉపగ్రహాలు, పేలోడ్లు విజయవంతంగా నిర్ణీత కక్ష్యలోకి చేరిన అనంతరం స్కైరూట్ సంస్థ సహ వ్యవస్థాపకులు పవన్ కుమార్ చందన, నాగ భరత్ డాకాతో ఫోన్‌లో మాట్లాడి అభినందనలు తెలిపారు. ఈ విజయం భారత అంతరిక్ష రంగంలో స్వయం సమృద్ధికి నిదర్శనంగా నిలుస్తుందని పేర్కొన్నారు. రాకెట్ ప్రయోగ సమయంలో శ్రీహరికోటలోని మిషన్ కంట్రోల్ కేంద్రంలో ఉన్న స్కైరూట్ బృందంతో మాట్లాడిన ప్రధాని, విక్రమ్-1 విజయంతో దేశానికి గర్వకారణమైన ఘట్టం ఆవిష్కృతమైందన్నారు. మిషన్ ఆగమన్ మరింత విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షిస్తూ, భారత అంతరిక్ష ప్రయాణంలో ఇది చారిత్రక మైలురాయిగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు.విక్రమ్-1 రాకెట్‌ను పూర్తిగా భారతదేశంలోనే రూపకల్పన చేసి అభివృద్ధి చేసినట్లు స్కైరూట్ సంస్థ ప్రతినిధులు ప్రధానికి వివరించారు. ప్రయోగానికి ముందు ప్రధాని రాసిన 'వందేమాతరం' సందేశంతో కూడిన లేఖ కూడా విజయవంతంగా కక్ష్యలోకి చేరినట్లు సంస్థ ప్రధాన కార్యనిర్వాహక

3

# వాంగ్‌చుక్ దీక్షపై ఉత్కంఠ

మెదటి పేజీ తరువాయి



డిమాండ్ చేస్తున్నారు. పరీక్షల వ్యవస్థలో సమగ్ర సంస్కరణలు తీసుకురావాలని, విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీసే అక్రమాలను అరికట్టేందుకు కఠిన చర్యలు చేపట్టాలని ఆయన కోరుతున్నారు. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం స్పందించాలని నిరసనకారులు డిమాండ్ చేస్తున్నారు. ఆసుపత్రికి తరలించిన తీరుపై వాంగ్‌చుక్ కుటుంబ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. తన అనుమతి లేకుండా భర్తకు ఎలాంటి చికిత్స చేయవద్దని ఆయన భార్య గీతాంజలి జె. ఆంగ్మో స్పష్టం చేశారు. మరోవైపు ఢిల్లీ పోలీసులు మాత్రం హైకోర్టు ఆదేశాలు, వైద్యుల సిఫారసుల మేరకే ఈ చర్య చేపట్టామని వెల్లడించారు. జంతర్‌మంతర్ వద్ద నిరసనకారులు అడ్డుకోవడంతో స్వల్ప ఉద్రిక్తత నెలకొన్నప్పటికీ పరిస్థితి అదుపులోకి తీసుకొచ్చామని తెలిపారు. వాంగ్‌చుక్‌ను ఆసుపత్రికి తరలించిన ఘటన రాజకీయంగా కూడా దుమారం రేపింది. ప్రతిపక్ష పార్టీలు కేంద్ర ప్రభుత్వ తీరుపై విమర్శలు గుప్పించగా, నిరసన హక్కును అణచివేస్తున్నారంటూ ఆరోపించాయి. మరోవైపు వాంగ్‌చుక్‌కు మద్దతుగా దేశవ్యాప్తంగా విద్యార్థి సంఘాలు, సామాజిక సంస్థలు సంఘీభావం ప్రకటిస్తున్నాయి. వాంగ్‌చుక్‌కు మద్దతుగా ఉద్యమాన్ని కొనసాగిస్తామని నిరసనకారులు ప్రకటించారు. ఉద్యమ నాయకుడు అభిజీత్ దిప్కే కూడా నిరవధిక నిరాహార దీక్ష ప్రారంభించినట్లు ప్రకటించగా, ఈ నెల 20న పార్లమెంట్ వరకు శాంతియుత నిరసన ప్రదర్శన నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ పరిణామాలతో రాజధాని ఢిల్లీలో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. వాంగ్‌చుక్ నిరాహార దీక్ష దేశవ్యాప్తంగా ప్రవేశ పరీక్షల నిర్వహణ, విద్యా వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనంపై విస్తృత చర్చకు దారితీసింది. పరీక్షల నిర్వహణలో విశ్వసనీయతను పెంచేందుకు సంస్కరణలు అవసరమని విద్యావేత్తలు అభిప్రాయపడుతుండగా, కేంద్ర ప్రభుత్వం తదుపరి ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే అంశంపై దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది.

# యువతకు అండగా ఉంటా కేటీఆర్

మెదటి పేజీ తరువాయి



హైదరాబాద్, జూలై 18 (మనప్రజాప్రతినిధి): కాంగ్రెస్ ప్రభుత్వం యూత్ డిక్లరేషన్ పేరుతో తెలంగాణ యువతను మోసం చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. యువ సంగ్రామ సదస్సులో నిరుద్యోగ యువతను ఉద్దేశించి మాట్లాడిన ఆయన, ఎన్నికల హామీలు అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. యువత ఆశలను వమ్ము చేసిన ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని వ్యాఖ్యానించారు. యువత సమస్యలను తాను అర్థం చేసుకుంటానని, ఒక అన్నగా ప్రతి యువకుడికి అండగా నిలుస్తానని కేటీఆర్ హామీ ఇచ్చారు. తెలంగాణ కోసం పోరాడి సాధించుకున్న రాష్ట్రంలో యువత భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారడాన్ని చూస్తూ ఊరుకోబోమని అన్నారు. నిరుద్యోగ యువతకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. తెలంగాణలో యువత ఆలోచనలకు ప్రోత్సాహం కల్పించేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం టీ హబ్, టీ వర్క్స్ వంటి సంస్థలను ఏర్పాటు చేసిందని కేటీఆర్ పేర్కొన్నారు. వాటి ద్వారా ఎన్నో వినూత్న ఆవిష్కరణలకు అవకాశం కల్పించామని చెప్పారు. టీ హబ్‌లో రూపుదిద్దుకున్న స్కైరూట్ సంస్థ దేశ చరిత్రలో తొలిసారిగా ప్రైవేట్ రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించడం తెలంగాణ ప్రతిభకు నిదర్శనమని పేర్కొన్నారు. పరిశ్రమలను రాష్ట్రంలో నిలబెట్టడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని కేటీఆర్ ఆరోపించారు. మరోవైపు తెలంగాణ నుంచి పరిశ్రమలు ఇతర రాష్ట్రాలకు తరలిపోతున్నాయని, దీనిపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని కూడా ప్రశ్నించాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ ప్రయోజనాల గురించి మాట్లాడితే ప్రాంతీయవాదమని విమర్శించడం సరైంది కాదని వ్యాఖ్యానించారు. రాష్ట్ర యువతకు ఉద్యోగాలు, పెట్టుబడులు, పరిశ్రమలు అత్యంత కీలకమని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణలో ఏర్పాటైన పరిశ్రమలు ఇతర రాష్ట్రాలకు తరలిపోకుండా ప్రభుత్వం సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణలో రాజీ పడబోమని స్పష్టం చేశారు. యువ సంగ్రామ సదస్సులో పెద్ద సంఖ్యలో నిరుద్యోగ యువత, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. యువత సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ప్రభుత్వ హామీల అమలుపై ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని కేటీఆర్ తెలిపారు.

# కల్తీలపై కఠిన చట్టం అమలు చేయండి సీఎం

మెదటి పేజీ తరువాయి



హైదరాబాద్, జూలై 18 (మనప్రజాప్రతినిధి): ఆహార పదార్థాలు, ఔషధాల్లో కల్తీలను అరికట్టేందుకు కఠినమైన తెలంగాణ ఆహార కల్తీ, ఔషధ నియంత్రణ చట్టాన్ని రూపొందించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో శనివారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో కల్తీల వల్ల ప్రజారోగ్యంపై పడుతున్న ప్రభావంపై విస్తృతంగా చర్చించారు. నిత్యావసర వస్తువులు, కూరగాయలు, పండ్లు, పాలు వంటి ఆహార పదార్థాల్లో పెరుగుతున్న కల్తీలు ప్రజలను తీవ్ర అనారోగ్యాలకు గురిచేస్తున్నాయని ముఖ్యమంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ఆకుకూరలు, కూరగాయలు, పాలు ఎక్కువ రోజులు నిల్వ ఉండేందుకు, పండ్లు త్వరగా మగ్గేందుకు విచ్చలవిడిగా రసాయనాలు వినియోగిస్తున్నారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అలాగే ఎరువులు, పురుగుమందుల అధిక వినియోగం కారణంగా వ్యవసాయ ఉత్పత్తుల్లో రసాయన అవశేషాలు పెరుగుతున్నాయని, దీనివల్ల కొన్ని దేశాలు దిగుమతులను కూడా నిరాకరిస్తున్న విషయాన్ని ప్రస్తావించారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ఈ పరిస్థితిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సేంద్రియ ఉత్పత్తుల పేరుతో మార్కెట్‌లో విక్రయిస్తున్న వస్తువుల నాణ్యతను నిర్ధారించే వ్యవస్థలు బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి సూచించారు. అధిక ధరలు చెల్లించి కొనుగోలు చేస్తున్న ఉత్పత్తులు నిజంగా సేంద్రియమైనవేనా అనే అంశంపై వినియోగదారులకు స్పష్టత కల్పించే విధానాలు రూపొందించాలని అధికారులకు ఆదేశించారు. కల్తీల నియంత్రణకు సమగ్ర చట్టాలు అమలులో ఉన్న దేశాలను సందర్శించి అక్కడి విధానాలను అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. ఆ అధ్యయనాల ఆధారంగా సమగ్ర నివేదిక సిద్ధం చేసి, దాని ప్రకారం బిల్లును రూపొందించి శాసనసభలో చర్చకు తీసుకురావాలని ఆదేశించారు. చట్టం రూపకల్పనలో ప్రజల అభిప్రాయాలు కూడా స్వీకరించాలని సూచించారు. కల్తీలకు సంబంధించిన సమాచారం సేకరించేందుకు విజిల్ బ్లోయర్ వ్యవస్థతో పాటు ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. కల్తీల నియంత్రణ చర్యలను ముందుగా క్యూర్ ప్రాంతంలో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేసి, వాటి ఫలితాలను పరిశీలించిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాలని అధికారులకు సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, రాష్ట్ర పోలీసు ప్రధాన అధికారి సీవీ ఆనంద్, ముఖ్యమంత్రి సలహాదారు, ఉన్నతాధికారులు, వివిధ శాఖల కార్యదర్శులు పాల్గొన్నారు. ప్రజారోగ్య పరిరక్షణకు అత్యున్నత ప్రాధాన్యం ఇస్తూ కల్తీల నిర్మూలనకు సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

# పెద్ద కలలు కనాలి...కష్టపడి చదవాలి

మెదటి పేజీ తరువాయి




యాదాద్రి భువనగిరి, జూలై 18 (మనప్రజాప్రతినిధి): విద్యార్థులు జీవితంలో పెద్ద లక్ష్యాలు పెట్టుకుని కష్టపడి చదవాలని, క్రమశిక్షణ, అంకితభావం, విలువలను కాపాడుకుంటూ ముందుకు సాగాలని రాష్ట్ర మైనారిటీల సంక్షేమం, ప్రభుత్వ రంగ సంస్థల శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ పిలుపునిచ్చారు. శనివారం యాదాద్రి భువనగిరి జిల్లా అరుట్లలోని తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను సందర్శించిన ఆయన మూడు గంటలకు పైగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్యంతో మమేకమయ్యారు. విద్యా, వసతి, క్రీడా సదుపాయాలను పరిశీలించిన అనంతరం విద్యార్థులతో కలిసి క్రికెట్ ఆడి వారిని ఉత్సాహపరిచారు. మంత్రి రాక సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్, అదనపు జిల్లా కలెక్టర్, ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. తరగతి గదులు, ప్రయోగశాలలు, హాస్టళ్లు, భోజనశాలలు, తాగునీటి వసతులు, క్రీడా మైదానాలు, క్రికెట్ ప్రాక్టీస్ నెట్స్, బాస్కెట్‌బాల్, వాలీబాల్ కోర్టులు తదితర మౌలిక సదుపాయాలను మంత్రి పరిశీలించి అధికారులతో చర్చించారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడిన మంత్రి, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ఆధునిక విద్యా సంస్థలు, అత్యుత్తమ విద్యా, క్రీడా మౌలిక సదుపాయాలను కల్పిస్తోందని తెలిపారు. ప్రస్తుతం విద్యార్థులకు ప్రపంచ స్థాయి సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకుని చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. విజయానికి సదుపాయాల కంటే సంకల్పం, కష్టపడి పనిచేసే తత్వం ఎంతో ముఖ్యమని చెప్పారు. తన చిన్ననాటి అనుభవాలను గుర్తు చేసుకున్న అజారుద్దీన్, తాను చదివిన రోజుల్లో పరిమిత వసతులే ఉన్నప్పటికీ క్రమశిక్షణ, అంకితభావం, నిరంతర సాధనతో అంతర్జాతీయ క్రికెటర్‌గా ఎదిగానని చెప్పారు. విద్యార్థులు డాక్టర్లు, ఇంజినీర్లు, శాస్త్రవేత్తలు, సివిల్ సర్వెంట్లు, ఉపాధ్యాయులు, క్రీడాకారులు లేదా తమకు ఇష్టమైన ఏ రంగంలోనైనా అత్యున్నత స్థాయిని లక్ష్యంగా పెట్టుకుని ముందుకు సాగాలని సూచించారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల పాత్ర విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో అత్యంత కీలకమని మంత్రి పేర్కొన్నారు. ఉపాధ్యాయులను గౌరవించాలని, సందేహాలు అడగడంలో ఎలాంటి సంకోచం అవసరం లేదని, జీవితాంతం నేర్చుకునే తత్వాన్ని అలవర్చుకోవాలని సూచించారు. అబ్బాయిలు, అమ్మాయిలు సమానంగా అవకాశాలను వినియోగించుకుని సమాజానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగాలని, మంచి అలవాట్లు, విలువలు, వినయం జీవిత విజయానికి పునాదులని వివరించారు. ప్రసంగం అనంతరం మంత్రి విద్యార్థులతో కలిసి క్రికెట్ ఆడి బ్యాటింగ్, ఫీల్డింగ్‌కు సంబంధించిన పలు సూచనలు అందించారు. తన అంతర్జాతీయ క్రికెట్ అనుభవాలను పంచుకుంటూ విద్యార్థుల ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. వందలాది మంది విద్యార్థులకు ఆటోగ్రాఫ్‌లు ఇచ్చి, వారితో ఫొటోలు దిగారు. మంత్రి సందర్శన తమకు మరపురాని అనుభూతిని కలిగించిందని, ఆయన సందేశాలు చదువు, క్రీడలు, జీవితంలో ఉన్నత లక్ష్యాల సాధనకు స్ఫూర్తినిచ్చాయని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేశారు.

# పవన్‌ను పరామర్శించిన లోకేష్

మెదటి పేజీ తరువాయి



హైదరాబాద్, జూలై 18 (మనప్రజాప్రతినిధి): కుడి భుజానికి శస్త్రచికిత్స చేయించుకున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ శనివారం సాయంత్రం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో పరామర్శించారు. పవన్ కల్యాణ్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విజయవాడ కనకదుర్గమ్మ చిత్రపటంతో పాటు అమ్మవారి ప్రసాదాన్ని నారా లోకేష్ పవన్ కల్యాణ్‌కు అందజేశారు. శస్త్రచికిత్స అనంతరం ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందో తెలుసుకుంటూ వైద్యులు సూచించిన జాగ్రత్తలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. భుజానికి తగిలిన గాయం, శస్త్రచికిత్స వివరాలపై పవన్ కల్యాణ్‌తో లోకేష్ మాట్లాడారు. వైద్యుల పర్యవేక్షణలో విశ్రాంతి తీసుకుని పూర్తి ఆరోగ్యంతో తిరిగి ప్రజాసేవలో పాల్గొనాలని ఆకాంక్షించారు. పరామర్శ సందర్భంగా ఇద్దరు నేతలు కొద్దిసేపు రాష్ట్రంలోని పలు అంశాలపై కూడా చర్చించినట్లు సమాచారం. పవన్ కల్యాణ్ ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందని, వైద్యుల సూచనల మేరకు విశ్రాంతి తీసుకుంటున్నట్లు తెలిసింది. ఉప ముఖ్యమంత్రి త్వరగా కోలుకోవాలని పలువురు ప్రజాప్రతినిధులు, అభిమానులు, పార్టీ నాయకులు ఆకాంక్షిస్తున్నారు. ఆయన ఆరోగ్యంపై ఎప్పటికప్పుడు వైద్యులు పర్యవేక్షణ కొనసాగిస్తున్నట్లు సమాచారం. ఈ పరామర్శ కార్యక్రమం స్నేహపూర్వక వాతావరణంలో జరిగింది. రాష్ట్ర ప్రజలకు సేవలందించే బాధ్యతల్లో తిరిగి త్వరలోనే పాల్గొనాలని ఆకాంక్షిస్తూ నారా లోకేష్ పవన్ కల్యాణ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

# మహిళపై దాడి.. వేగంగా చర్యలు


మెదటి పేజీ తరువాయి



వెల్లడించారు. మహిళలపై దాడులకు పాల్పడిన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని, రాజకీయ అండ ఎవరినీ చట్టం నుంచి తప్పించలేదని స్పష్టం చేశారు. రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడి కేసును అత్యంత ప్రాధాన్యంగా విచారించాలని ఆదేశించారు. నిందితులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని, దర్యాప్తులో ఏమాత్రం నిర్లక్ష్యం ప్రదర్శించినా సంబంధిత అధికారులపైనా చర్యలు తప్పవని హెచ్చరించారు. కేసు పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని అధికారులకు సూచించారు. ఘటన జరిగిన వెంటనే పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. బాధిత మహిళకు అవసరమైన భద్రత, న్యాయపరమైన సహాయం అందించాలని సంబంధిత అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. కేసు దర్యాప్తును వేగంగా పూర్తి చేసి నిందితుడిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. సొంత పార్టీకి చెందిన వ్యక్తి ప్రమేయం ఉన్నప్పటికీ ప్రభుత్వం వేగంగా స్పందించి కఠిన చర్యలు తీసుకోవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మహిళల భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, తప్పు చేసిన వారు ఎవరైనా చట్టం ముందు సమానమేననే సందేశాన్ని ప్రభుత్వం మరోసారి స్పష్టం చేసింది.

# విక్రమ్-1 విజయంపై మోదీ హర్షం

తరువాయి భాగం



అధికారి పవన్ కుమార్ చందన తెలిపారు. ఈ విజయం తమ బృందానికి మరింత ఉత్సాహాన్ని ఇచ్చిందన్నారు. ప్రైవేటు రంగానికి కేంద్ర ప్రభుత్వం కల్పించిన అవకాశాల వల్ల అంతరిక్ష పరిశోధనల్లో కొత్త ఆవిష్కరణలకు మార్గం సుగమమైందని ప్రధాని పేర్కొన్నారు. ఇస్రోతో పాటు ప్రైవేటు సంస్థలు కూడా ప్రపంచ స్థాయిలో పోటీ పడే సామర్థ్యాన్ని సొంతం చేసుకుంటున్నాయని, ఈ విజయం దేశ యువతలో శాస్త్ర సాంకేతిక రంగంపై మరింత ఆసక్తిని పెంచుతుందని చెప్పారు. భారత యువతలోని ప్రతిభ, సృజనాత్మకత, పట్టుదలకు స్కైరూట్ విజయం నిదర్శనమని ప్రధాని కొనియాడారు. యువ ఆవిష్కర్తలు నిర్భయంగా తమ ఆలోచనలకు రూపమిస్తూ ప్రపంచ స్థాయిలో భారత ప్రతిభను చాటాలని ఆకాంక్షించారు. అంతరిక్ష రంగంలో భారత ప్రైవేటు సంస్థలకు ఇది మరింత విశ్వాసాన్ని కలిగించే విజయమని అభిప్రాయపడ్డారు. విక్రమ్-1 విజయంతో భారత ప్రైవేటు అంతరిక్ష రంగం మరో కీలక మైలురాయిని చేరుకుంది. తక్కువ వ్యయంతో విశ్వసనీయ ఉపగ్రహ ప్రయోగ సేవలను ప్రపంచానికి అందించే దిశగా స్కైరూట్ అడుగులు వేస్తుండగా, ఈ విజయం భవిష్యత్తులో మరిన్ని వాణిజ్య ప్రయోగాలకు బాటలు వేయనుందని అంతరిక్ష రంగ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

# 2027 నాటికి పోలవరం పూర్తి చేస్తాం

తరువాయి భాగం



గుడివాడ, జూలై 18 (మనప్రజాప్రతినిధి): ఆంధ్రప్రదేశ్ జీవనాడిగా భావిస్తున్న పోలవరం ప్రాజెక్టును 2027 నాటికి వంద శాతం పూర్తి చేసి ప్రజలకు అంకితం చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. కృష్ణా జిల్లా గుడివాడలో నిర్వహించిన 'స్వర్ణాంధ్రస్వచ్ఛాంధ్ర' బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ పోలవరం నిర్మాణ పనులను కూటమి ప్రభుత్వం అత్యంత వేగంగా ముందుకు తీసుకెళుతోందని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధికి నీటి వనరులే ప్రధాన ఆధారమని పేర్కొన్నారు. పట్టిసీమ ప్రాజెక్టును గతంలో కేవలం 12 నెలల రికార్డు సమయంలో పూర్తి చేసి కృష్ణా డెల్టాకు సాగునీరు అందించిన విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. అదే స్ఫూర్తితో పోలవరం నిర్మాణాన్ని కూడా వేగవంతం చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలోని ప్రధాన నదులన్నింటినీ అనుసంధానం చేయడం ద్వారా భవిష్యత్తులో కరవు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం కట్టుబడి ఉందని చంద్రబాబు పేర్కొన్నారు. అందులో భాగంగా ఈ నెల నుంచే 'తల్లికి వందనం' పథకాన్ని ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. ప్రతి హామీని దశలవారీగా అమలు చేస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటామని తెలిపారు. కృష్ణా జిల్లాకు చారిత్రక, సాంస్కృతిక ప్రాధాన్యం ఎంతో గొప్పదని ముఖ్యమంత్రి అన్నారు. అభివృద్ధి కార్యక్రమాల్లో కూడా ఈ జిల్లాను ముందంజలో నిలిపేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు సాగుతోందన్నారు. మౌలిక సదుపాయాల విస్తరణతో పాటు వ్యవసాయం, పరిశ్రమలు, ఉపాధి అవకాశాల పెంపుపై దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. స్వర్ణాంధ్రస్వచ్ఛాంధ్ర కార్యక్రమం ద్వారా రాష్ట్రాన్ని పరిశుభ్రంగా, పచ్చదనంతో తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని చంద్రబాబు పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు చెత్తను శాస్త్రీయంగా నిర్వహించి సంపదగా మార్చే విధానాలను అమలు చేస్తున్నామని చెప్పారు. గ్రామాలు, పట్టణాల్లో పరిశుభ్రతకు ప్రజల భాగస్వామ్యం అత్యంత అవసరమని పిలుపునిచ్చారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి నీటి పారుదల, సంక్షేమం, మౌలిక సదుపాయాలు, పర్యావరణ పరిరక్షణ వంటి అన్ని రంగాలకు సమాన ప్రాధాన్యం ఇస్తూ ప్రభుత్వం పనిచేస్తోందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడంతో పాటు ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన తెలిపారు.

# ప్రయాణిస్తున్న బస్సులో మంటలు

**-డ్రైవర్ అప్రమత్తతతో తప్పిన పెను ప్రమాదం**

**-23 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడిన ఘటన**

**-బస్సు పూర్తిగా దగ్ధం.. కారణాలపై దర్యాప్తు**



చెన్నై, జూలై 18 (మనప్రజాప్రతినిధి): తమిళనాడు రాజధాని చెన్నై నుంచి మధురైకి వెళ్తున్న ఓ ప్రైవేటు స్లీపర్ కోచ్ బస్సులో శనివారం తెల్లవారుజామున భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. పెరంబలూరు జిల్లాలోని చెన్నైతిరుచిరాపల్లి జాతీయ రహదారిపై బస్సు ప్రయాణిస్తున్న సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. బస్సులో నుంచి పొగ, మంటలు వస్తున్న విషయాన్ని గమనించిన డ్రైవర్ వెంటనే అప్రమత్తమై వాహనాన్ని రహదారి పక్కకు నిలిపివేశారు. అనంతరం బస్సులో ఉన్న ప్రయాణికులందరినీ వేగంగా కిందకు దింపి సురక్షిత ప్రాంతానికి తరలించారు. డ్రైవర్ సమయస్ఫూర్తితో వ్యవహరించడంతో పెద్ద ప్రమాదం తప్పిందని అధికారులు తెలిపారు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో మొత్తం 23 మంది ప్రయాణికులు ఉన్నారు. వారంతా సురక్షితంగా బయటపడగా, ఎవరూ గాయపడకపోవడం ఊరటనిచ్చింది. కొన్ని క్షణాల ఆలస్యం జరిగినా ప్రాణనష్టం సంభవించే అవకాశం ఉండేదని ప్రత్యక్ష సాక్షులు పేర్కొన్నారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అయితే అప్పటికే బస్సు పూర్తిగా అగ్నికి ఆహుతై దగ్ధమైంది. మంటల తీవ్రత ఎక్కువగా ఉండటంతో వాహనం పూర్తిగా కాలిపోయింది. అగ్నిప్రమాదానికి గల కారణాలపై అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. సాంకేతిక లోపమా, విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణమా అనే కోణాల్లో విచారణ చేపట్టారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలను సేకరిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ ఘటనతో జాతీయ రహదారిపై కొంతసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అనంతరం పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సహాయంతో కాలిపోయిన బస్సును తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు. డ్రైవర్ అప్రమత్తత వల్ల 23 మంది ప్రయాణికుల ప్రాణాలు సురక్షితంగా నిలిచాయని స్థానికులు ప్రశంసించారు.

# పార్టీలు వేరైనా...మేమంతా ఒక్కటే

# యంగ్ ఇండియా స్కూల్ సాధన కమిటీ




మన ప్రజా ప్రతినిధి కొండపాక :మండలంలో యంగ్ ఇండియా స్కూల్ ఏర్పాటు కోసం ప్రజా ఉద్యమం రోజు రోజుకూ ఉధృతమవుతోంది. కొండపాక కు కేటాయించిన యంగ్ ఇండియా స్కూల్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతర ప్రాంతానికి తరలించడానికి అనుమతించబోమని అఖిలపక్ష నాయకులు స్పష్టం చేశారు. శనివారం రోజు కొండపాక మండలం వెలికట్ట క్రాస్ రోడ్డులోని అనంతుల నరేందర్ కార్యాలయంలో అఖిలపక్ష నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడుతూ, "యంగ్ ఇండియా స్కూల్ కొండపాక ప్రజల హక్కు. ఈ హక్కును కాపాడుకోవడం కోసం అవసరమైతే ఎంతటి ఉద్యమానికైనా సిద్ధమే అని ప్రజల మనోభావాలను విస్మరించి స్కూల్‌ను తరలించే ప్రయత్నం చేస్తే తీవ్ర ప్రజా ఆందోళన తప్పదు" అని హెచ్చరించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి, కొండపాక మండలంలోనే యంగ్ ఇండియా స్కూల్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. ప్రజల ఆకాంక్షలను విస్మరిస్తే ఉద్యమాన్ని మండల స్థాయి నుంచి జిల్లా, రాష్ట్ర స్థాయికి విస్తరించి, ప్రజాస్వామ్యబద్ధంగా మరింత ఉధృతంగా కొనసాగిస్తామని స్పష్టం చేశారు. యంగ్ ఇండియా స్కూల్ సాధనలో రాజకీయాలకు అతీతంగా అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, యువత, రైతులు, మహిళలు, కుల సంఘాలు, సామాజిక సంస్థలు మరియు మండల ప్రజలంతా ఒక్కతాటిపై నిలవాలని అఖిలపక్ష నాయకులు పిలుపునిచ్చారు. "కొండపాక హక్కు యంగ్ ఇండియా స్కూల్ మా లక్ష్యం" అనే నినాదంతో ఉద్యమాన్ని విజయవంతం చేయాలని ప్రజలను కోరారు. అనంతరం సిద్దిపేట జిల్లా ఇంచార్జ్ మినిస్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి నీ కలిసి స్కూల్ నిర్మాణానికి సంబంధించిన వినతి పత్రాన్ని సిద్దిపేటలో అందజేశారు. ఈ సందర్భంగా వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ సానుకూలంగా స్పందిస్తూ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు

# పెన్నార్ లో బి ఆర్ టి యు జెండా ఆవిష్కరణ



సదాశివపేట్ మండల్ //(మన ప్రజాప్రతినిధి):సదాశివపేట మండలం చందాపూర్ లోని పెన్నార్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ కంపెనీలో బి ఆర్ టి యు జెండా ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అధ్యక్షులు రాంబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ యాదగిరి విచ్చేసి జెండావిష్కరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల సమస్యలపై కలిసికట్టుగా పోరాడటం జరుగుతుందన్నారు. ఈ జెండా ఆవిష్కరణలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయడం జరిగింది. పెన్నార్ ఇండస్ట్రీస్ జనరల్ సెక్రెటరీ సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్ వీరన్న, రమేష్, ప్రసాద్, బాబు, రవీంద్ర, దుర్గాప్రసాద్, లక్ష్మణ్, పుట్టరాజు, శ్రీశైలం, అనిల్, భాగయ్య, సంతోష్ కుమార్, అనిల్, వెంకటేశం, సురేష్, కార్మికులు అధిక సంఖ్యలో జెండా ఆవిష్కరణ కార్యక్రమశీ లో పాల్గొన్నారు.

# బచ్చుల గోపాల్ స్వామి కుటుంబానికి చెరుకు శ్రీనివాస్ రెడ్డి పరామర్శ!



మన ప్రజ ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట జులై 18:మెదక్ జిల్లా, చేగుంట మండలం, చేగుంట మాజీ ఎంపీపీ మాసుల శ్రీనివాస్ వాళ్ళ మామ, ప్రముఖులు బచ్చుల గోపాల్ స్వామి ఇటీవల మరణించిన సంగతి తెలిసిందే. ఈ విషయం తెలుసుకున్న దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి చేగుంటలోని వారి స్వగృహానికి వెళ్లి ఆయన తనయుడు ప్రవీణ్‌ను, కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికి తన గాఢ సానుభూతిని తెలియజేస్తూ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ పరామర్శ కార్యక్రమంలో చేగుంట మార్కెట్ కమిటీ చైర్మన్ తాడేపు వెంగలరావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రజనల ప్రవీణ్ కుమార్, చేగుంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వడ్ల నవీన్ కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సంద్రుగు శ్రీకాంత్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

# శ్రీ జగన్నాథ రథోత్సవంలో పాల్గొన్న12వ వార్డు కౌన్సిలర్ పులిమామిడి మమత




సదాశివపేట మండల్//(మన ప్రజా ప్రతినిధి): సదాశివపేట పట్టణంలోని ది మాస్టర్ మైండ్ ఈ-టెక్నో స్కూల్ వారి ఆధ్వర్యంలో 2026 జూలై 17న నిర్వహించిన శ్రీ జగన్నాథ రథయాత్ర మహోత్సవం భక్తిశ్రద్ధలతో, అత్యంత వైభవంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి గౌరవనీయులైన వైస్ చైర్మన్ రేణుక చిరంజీవి, కౌన్సిలర్లు పులిమామిడి మమత రాజు, ఎర్ర విశాలి, సంక్షయ్ గౌడ్, ప్రముఖులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వారితో పాటు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై రథ యాత్రను విజయవంతం చేశారు. ఈ పవిత్ర రథయాత్ర అయ్యప్ప స్వామి ఆలయం నుండి ప్రారంభమై, ది మాస్టర్ మైండ్ ఈ-టెక్నో స్కూల్ వరకు భక్తిపూర్వకంగా కొనసాగింది. వందలాది మంది భక్తులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానిక ప్రజలు పాల్గొని ఈ మహోత్సవాన్ని ఆధ్యాత్మిక వేడుకగా తీర్చిదిద్దారు. రథయాత్ర సందర్భంగా విద్యార్థులు ఉత్సాహంగా "హరే కృష్ణ" నామసంకీర్తనలు చేస్తూ, భజనలు, కీర్తనలతో భక్తిమయ వాతావరణాన్ని సృష్టించారు. మహిళలు సంప్రదాయ కోలాటం ప్రదర్శించగా, పురుషులు హరే కృష్ణ నృత్యంలో ఉత్సాహంగా పాల్గొని యాత్రకు మరింత శోభను చేకూర్చారు. రథయాత్ర ముగింపులో పాల్గొన్న భక్తులు, అతిథులు, ప్రజలందరికీ ప్రసాదం (అన్నదానం) అందజేశారు. ఈ కార్యక్రమం ద్వారా భక్తి, ఐకమత్యం, సేవాభావం, భారతీయ సంస్కృతి మరియు ఆధ్యాత్మిక విలువలను చిన్నారులు, కుటుంబ సభ్యుల్లో పెంపొందించే లక్ష్యాన్ని విజయవంతంగా సాధించారు. ఈ శ్రీ జగన్నాథ రథయాత్ర మహోత్సవం సదాశివపేట ప్రజల హృదయాలలో చిరస్మరణీయమైన ఆధ్యాత్మిక వేడుకగా నిలిచింది. ఈ కార్యక్రమం ప్రిన్సిపల్ ఎం. నవనీత, కరస్పాండెంట్‌సంతోష్, వైస్ ప్రిన్సిపల్ వీణావాణి అధ్యాపక బృందం నందిని, లక్ష్మి, భాను, లక్ష్మి ప్రసన్న, మీన, నాగ లక్ష్మి, ప్రవీణ్, డాన్స్ మాస్టర్ శ్రీనివాస్ మొదలగు వారు పాల్గొన్నారు.

# అందేశ్రీ జయంతి వేడుకలు



మన ప్రజా ప్రతినిధి కొండపాక మండల్:గజ్వేల్ నియోజకవర్గం కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా అందేశ్రీ జయంతి వేడుకలు నిర్వహించారు.హైదరాబాద్ తెలంగాణ అమరవీరుల స్మారక భవనం అమర జ్యోతి ఆడిటోరియంలో తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ కవులు కళాకారుల సమావేశం లో పాల్గోని డాక్టర్ అందె శ్రీ కి గజ్వేల్ నియోజకవర్గం కళాకారులు ఘన నివాళులు అర్పించి స్వరాష్ట్ర సాధన కోసం ఎన్నో పాటలు రాసిన అందె శ్రీ ని యాది చేశారు.ఈ కార్యక్రమంలో గజ్వేల్ నియోజకవర్గ కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షులు పిల్లిట్ల శ్యామ్ మరియు జిల్లా లో పేరు మోసిన కళాకారులు మర్పడగ యాదగిరి, కనకయ్య, కవి గాయకులు పిన్నింటి రత్నం, హరిప్రసాద్,పిన్నింటి కరుణాకర్ డప్పు, శశిధర్, కిషన్, డబ్బేటా యాదగిరి, నర్సింలు, గౌరయ్య, ప్రభాకర్, సిద్దులు, తదితరులు పాల్గొన్నారు.

# "వర్షాలు తక్కువ.. రైతులు మెట్ట పంటల వైపు దృష్టి సారించాలి"



మన ప్రజా ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట జూలై 18:జిల్లా లో ఎల్ నినో వాతావరణ పరిస్థితులు ప్రభావం వల్ల ఈ ఏడాది వర్షాలు తక్కువగా నమోదవుతాయని వాతావరణ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్న మేరకు ఈ పరిస్థితుల్లో రైతాంగం సాంప్రదాయ సాగు చేయకుండా, మారుతున్న ప్రకృతి సవాళ్లకు అనుగుణంగా అప్రమత్తం కావాలి. అధిక నీటి వినియోగం ఉండే పంటల జోలికి వెళ్లకుండా, తక్కువ నీటి అవసరాలతో చేతికొచ్చే ప్రత్యామ్నాయ మెట్ట పంటల వైపే దృష్టి సారించాలని తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు, కార్మిక, ఉపాధి ,గనుల, పారిశ్రామిక, భూగర్భ వనరుల శాఖ, మెదక్ జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు గడ్డం వివేక్ వెంకటస్వామిఅన్నారు.శనివారం మెదక్ జిల్లా పరిధిలోని చేగుంట మండలంలో మంత్రి విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక రైతు వేదికలో ఎల్ నినో వ్యవసాయ శాఖ అవగాహన సదస్సులో మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం ఎల్లప్పుడూ రైతుల పక్షపాతి అని, ఇప్పటికే 'రైతు భరోసా' అందించి అన్నదాతలకు అండగా నిలిచామని స్పష్టం చేశారు. మారుతున్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా శాస్త్రవేత్తల సూచనలను పాటిస్తూ సాగు విధానాల్లో మార్పులు చేసుకోవడం అత్యంత ఆవశ్యకమని ఆయన పేర్కొన్నారు. ఇప్పటివరకు జిల్లాలో అనుకున్నంత వర్షపాత నమోదు కాలేదని భూగర్భ జలాలు వరి పంటకు అనుకూలంగా లేకపోవడం వల్ల రాష్ట్ర ప్రభుత్వం మొదటి నుంచి ఎల్ నినో ప్రభావం ఉంటుందని రైతులకు విస్తృత ప్రచారం కల్పించిందన్నారు. అవగాహన లేమితో వరి పంటను పండిస్తున్నారని ఇప్పటికైనా ప్రత్యామ్నాయ ఆరుతడి పంటలపై మొగ్గు చూపాలన్నారు. అంతకుముందు రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగు చేయాలంటే వారికున్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లారుకోతులు బెడద ఎక్కువగా ఉందని అన్నారు, అనంతరం జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ మాట్లాడుతూ..వరి వద్దు, ప్రత్యామ్నాయ పంటలే ముద్దు, అని నినాదంతో జిల్లాలో రైతులకు విస్తృత ప్రచారం కల్పిస్తున్నామని, ఇప్పటికే అనేక సదస్సులలో రైతులకు చెప్పడం జరిగిందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, ఆదేశించిన మేరకు జిల్లాలోని అన్ని రైతు వేదికలలో ఎల్ నీనో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు వివరించారు. రైతులందరూ వ్యవసాయ శాఖ సలహాలు సూచనలు పాటిస్తూ ప్రత్యామ్నాయ పంటలపై మొగ్గు చూపాలని ఈ సందర్భంగా కలెక్టర్ వెల్లడించారు.ఈ కార్యక్రమంలో తూప్రాన్ ఆర్డీవో బావయ్య, డి డబ్ల్యు ఓ హేమ భార్గవి, జిల్లా వ్యవసాయ అధికారి, ప్రజా ప్రతినిధులు, మండల వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 3వ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి



గరిడేపల్లి (మన ప్రజా ప్రతినిధి దినపత్రిక )అఖిలభారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) సూర్యాపేట జిల్లా మూడవ మహాసభలు జూలై 19న చిలుకూరులో జరగనున్న మహాసభలను జయప్రదం చేయాలి అని ఏఐవైఎఫ్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడుచిలక రాజు శ్రీను పిలుపునిచ్చారు శనివారం నాడు గరిడేపల్లి మండలం గానుబండ గ్రామంలో ఏఐవైఎఫ్ జిల్లా మహాసభల కరపత్రాన్ని వారు ఆవిష్కరించి మాట్లాడుతూ.....(అఖిలభారత యువజన సమాఖ్య) 1959 మే 3న ఆవిర్భవించి నాటినుండి భగత్ సింగ్ ,రాజ్ గురు ,సుకుదేవ్ , సుభాష్ చంద్రబోస్, అల్లూరి సీతారామరాజు లాంటి అమరుల వారసత్వాన్ని పునికి పుచ్చుకొని దేశంలో ఉన్న యువతరం ఎదుర్కొంటున్న సమస్యలపై ఎప్పటికప్పుడు సమ సమాజ అభివృద్ధికై పాటుపడుతున్న ఏకైక యువజన సంఘం ఏఐవైఎఫ్ అని అన్నారు. పని హక్కు ప్రాథమిక హక్కుగా గుర్తించాలని సమగ్ర యువజన విధానం కోసం, విద్యా అవకాశాల కోసం, ఉద్యోగ ఉపాధి హక్కుల కోసం, డ్రగ్స్ మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ఏఐవైఎఫ్ సమర శంఖారావం పూరించడానికి జులై 19వ తేదీ చిలుకూరు మండల కేంద్రంలో దొడ్డ నరసయ్య భవనం వేదిక అవుతుందని . సూర్యాపేట జిల్లా 3వ మహాసభలకు అధిక సంఖ్యలో యువజనులు కదిలి రావాలని వారు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ గౌరవ అధ్యక్షుడు లింగరాజు మండల అధ్యక్షుడు పంగ సైదులు

## రాంకీ చెత్త డంపింగ్ ప్రాంతాల్లో జరిగిన మరణాలన్ని అసహజ మరణాలే

ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక మేడ్చల్:స్పష్టం చేసిన అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జాతీయ నాయకురాలు విమలక్క..జవహర్ నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరిటకమిటి ఆధ్వర్యంలో జరిగిన 8 వ రోజు పాదయాత్రకు ముఖ్య అతిథిగా విచ్చేసి, తమ ఆట, మాట, పాటలతో అలరించిన అరుణోదయ విమలక్క బృందం.ఏ.ఐ.ఎఫ్.టి.యు. రాష్ట్ర అధ్యక్షుడు మరియు కమిటీ కో కన్వీనర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమం.జవహర్ నగర్ డంపింగ్ యార్డు ప్రభావిత ప్రాంతాల్లో గత 20 సంవత్సరాలుగా జరిగిన ప్రజల మరణాలన్ని సహజ మరణాలు కావని, అవి రాంకి చెత్తడంపింగ్ యార్డు ద్వారా జరిగిన అసహజ మరణాలేనని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జాతీయ నాయకులు విమలక్క స్పష్టం చేశారు. 2026, జూలై-18, కీసర సర్కిల్, జవహర్ నగర్ జీహెచ్ఎంసీ, వికలాంగుల, లెప్రెసీ కాలనీలల్లో జవహర్ నగర్ రాంకీ చెత్త డంపింగ్ యార్డు ఎత్తివేతకై జూలై-26న జరిగే అవగాహన సదస్సును దృష్టిలో పెట్టుకొని 8 వ రోజు పాదయాత్ర కార్యక్రమం జవహర్ నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాటకమిటి కో కన్వీనర్ మరియు ఏ.ఐ.ఎఫ్.టి.యు. వై మల్లేష్ అధ్యక్షతన జరిగింది. ఈపై కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన విమలక్క, డంపింగ్ యార్డు చుట్టూ ఉన్న నాలుగు మండలాల లక్షలాది మంది ప్రజల ప్రాణాలకు విలువ లేకుండా పోతున్నదని మండిపడ్డారు. ప్రజల ఆరోగ్యాలను, వారి ప్రాణాలను, పర్యావరణాన్ని కాపాడాల్సిన పాలక ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. గత 15 సంవత్సరాలుగా పర్యావరణ, విద్యా వేత్తలు, మేదావులు, ప్రజా ఉద్యమ కార్యకర్తలు, నాయకులు, ప్రజలు చేస్తున్న ఆందోళనలు చెవిటివాడి ముందు శంఖం ఊదీన చందంగా తయారయిందని అన్నారు. ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకరమైన ప్రాంతంగా గుర్తింపు పొందిన డంపింగ్ యార్డు తొలగింపును చేపట్టాల్సిన ప్రభుత్వాలు అందుకు విరుద్ధంగా మరిన్ని ఎకరాలు కేటాయించి, హైదరాబాద్ చెత్త మొత్తాన్ని ఒకే ప్రాంతంలో దంపుచేయడం ప్రజల ఆరోగ్యాలపై పెను ప్రమాదం అని ఆందోళన వ్యక్తం చేశారు. చెత్త ద్రవం భూమిలోకి చేరి, భూగర్భ జలాలు, వాయు కాలుష్యం విషతుల్యంగా మారిపోయాయని గుర్తుచేశారు. అనారోగ్యాలకు, అసహజ మరణాలకు కారణమైన వ్యవస్థలు అన్ని, అవినీతి కేంద్రాలకు నిలయాలుగా నిలిచాయని ఆరోపించారు. ఇప్పటికైన త్యాగాలు, పోరాటాలు చేసి, తెలంగాణ రాష్ట్రాన్ని సాదించుకున్న ప్రజలకు, డంపింగ్ యార్డును జవహర్ నగరంలో ప్రాంతం నుండి వెళ్ళగొట్టడం పెద్ద సమస్య కాదని సూచించారు. ఇప్పటికైన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డంపింగ్ యార్డు తొలగింపు విషయంలో కల్లబొల్లి కబుర్లు, కట్టుకథలు, మభ్యపట్టే చర్యలకు స్వస్థిపలికి, బేషరతుగా ఎత్తివేయాలని తమ ఆట, మాట, పాటలతో అరుణోదయ

# విద్యార్థులు కష్టపడి చదివి భవిష్యత్తులో ఒక స్థాయికి ఎదగాలి



మనప్రజాప్రతినిధి//కంగ్టి మండలం: శనివారం కంగ్టి మండలం నాగూర్ (కె) ప్రాథమిక పాఠశాలలో పేరెంట్స్, టీచర్స్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రగతి, హాజరు శాతం, విద్యా బోధన, అభ్యాసన తీరుపై స్థానిక హెచ్ఎం తో చర్చించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఈ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు ఈ సందర్భంగా చేతులు పరిశుభ్రతకు ఎలా కడుక్కోవాలో విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం, టీచర్లు, పేరెంట్స్ విద్యార్థులు ఉన్నారు

# మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం చేసిన ముత్యం బాలగౌడ్



మన ప్రజాప్రతినిధి/18 మనకొండూరు తేదీ జూలై :ఇల్లంతకుంట మండల కేంద్రానికి చెందిన బండారి శ్రీనివాస్ (వైన్స్) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, శనివారం సామాజిక సేవకుడు ముత్యం బాలగౌడ్ మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం కుటుంబానికి అండగా నిలుస్తూ రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఈ సందర్భంగా గౌడ సంఘం సభ్యులు కొయ్యడ రాజయ్య, దొడ్ల దేవేందర్, సారా నారాయణ, వొల్లాల రాములు, నాయిని తిరుపతి, బండారి శ్రీనివాస్, బొంగోని అనిల్, చందు,సాయి,పంజాల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తుకు చేయూత.. అల్వాలలో శ్రీ అనంతరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ సేవలు ప్రశంసనీయం




(మన ప్రజా ప్రతినిధి జులై 18):సిద్దిపేట జిల్లా, మిడిదొడ్డి మండలం, అల్వాల: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు నాణ్యమైన విద్య అందించేందుకు శ్రీ అనంతరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ నిరంతరం కృషి చేస్తోందని అల్వాల ఉప సర్పంచ్ తుడుము సాయిలు, ట్రస్ట్ డైరెక్టర్ పోల్‌రెడ్డి దిలీప్‌రెడ్డి, మాజీ సర్పంచ్ గుర్రప్పగారి రాజిరెడ్డి కొనియాడారు.మిడిదొడ్డి మండలం అల్వాల గ్రామ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో గుర్రప్ప వారి మాధవ రెడ్డి సహకారంతో విద్యార్థులకు స్కూల్ యూనిఫాంలు, నోట్‌బుక్స్, స్కూల్ బ్యాగులు, ఐడీ కార్డులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గత నాలుగు సంవత్సరాలుగా మాధవ రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులను ప్రోత్సహించేందుకు విశేషంగా కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని పేర్కొన్నారు.విద్యార్థుల సంక్షేమం కోసం ట్రస్ట్ అందిస్తున్న సేవలపై తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తూ మాధవ రెడ్డి సేవలను అభినందించారు.ఈ కార్యక్రమంలో అల్వాల ఉప సర్పంచ్ తుడుము సాయిలు, అనంతరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ డైరెక్టర్ పోల్‌రెడ్డి దిలీప్‌రెడ్డి, మాజీ సర్పంచ్ గుర్రప్పగారి రాజిరెడ్డి, వార్డు సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# పచ్చదనంపరిశుభ్రతే లక్ష్యం.. దౌల్తాబాద్ జూనియర్ కళాశాలలో క్లీన్ అండ్ గ్రీన్




(మన ప్రజా ప్రతినిధి జులై 18): దౌల్తాబాద్: ప్రభుత్వ జూనియర్ కళాశాల, దౌల్తాబాద్‌లో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో "క్లీన్ అండ్ గ్రీన్" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు కళాశాల ఆవరణను పరిశుభ్రపరిచి, మొక్కల సంరక్షణ చేపడుతూ పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు.ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డా. ఎం. మంగత మరియు ఎం. సంపత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వాలంటీర్లు అత్యంత ఉత్సాహంగా పాల్గొని కళాశాల ప్రాంగణాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ మధు శ్రీవాస్తవ మాట్లాడుతూ, "పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత. పరిశుభ్రమైన, పచ్చదనంతో కూడిన కళాశాల వాతావరణం విద్యార్థుల్లో క్రమశిక్షణతో పాటు సామాజిక బాధ్యతను పెంపొందిస్తుంది. స్వచ్ఛతను అలవాటుగా మార్చుకొని, పర్యావరణ పరిరక్షణలో ప్రతి విద్యార్థి తన వంతు పాత్ర పోషించాలి. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే ఇటువంటి సేవా కార్యక్రమాలు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి ఎంతో దోహదపడతాయి" అని అన్నారు.ఈ కార్యక్రమంలో స్టూడెంట్ కౌన్సిలర్ శివకుమార్, అధ్యాపకులు రాజు, సుధాకర్, లక్ష్మీనారాయణ, దయానంద్, శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి, భాగ్యమ్మ, రమ్య, పవన్ కుమార్, నాగేశ్వర్ రావు, బోధనేతర సిబ్బంది మరియు వాలంటీర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఘనంగా జంగారెడ్డి ఆధ్వర్యంలో శ్రీ జగన్నాథ రథోత్సవం



మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక మేడ్చల్ :నాగారం డివిజన్ పరిధిలోని సెర్నిటీ మోడల్ హైస్కూల్ కరస్పాండెంట్ నోముల వసంత్ జంగారెడ్డి గారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన శ్రీ జగన్నాథ రథయాత్రలో నాగారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు.ఈ పవిత్ర రథయాత్రలో సెర్నిటీ మోడల్ హైస్కూల్ యాజమాన్యం, తల్లిదండ్రులు, విద్యార్థులతో కలిసి జగన్నాథ స్వామివారి ఆశీస్సులు పొందారు.ఈ కార్యక్రమంలో కొడిమల కొండల్ రెడ్డి , రవీందర్ రెడ్డి , సుర్వి రాజుగౌడ్, చెన్నుపాటి సుబ్బారావు పాల్గొని రథయాత్రను విజయవంతం చేశారు.